BHAVAVEENA
Vol. 17, Issue. 10, October 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# నాయని కృష్ణకుమారి

జానపద వాఙ్మయానికి

\- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 17, Issue. 10, October 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# Contents (విషయ సూచిక)


| | | |
|---|---|---|
| 1. తెలుగు కథ - కమ్యూనికేషన్ వ్యవస్థల చిత్రణ | - డా॥. ఎవివికె. చైతన్య | 5 |
| 2. జానపద కళారూపాలు - వాయిద్య పరికరాలు | - వి. ఆశాజ్యోతి | 11 |
| 3. తెలంగాణలో చర్మకారుల సామాజికార్థిక పరిస్థితులు - ఒక పరిశీలన | - డా॥. బి. కుమారస్వామి | 17 |
| 4. "గుర్రం జాషువా సాహిత్యం - సమకాలీనత : ఒక పరిశీలన" | - డా॥. డి. సహదేవుడు | 26 |
| 5. గురజాడ ఆధునిక దృక్పథం | - డా॥. ఎన్.అంబర్‌సింగ్ | 30 |
| 6. స్త్రీ నవలల్లో 'పునరుత్పత్తి' 'మాతృత్వం' భావనలు | - డా॥. పంతంగి వెంకటేశ్వర్లు | 34 |
| 7. రాచపాళెం కవిత్వం - రైతు - రాజీయం | - డా॥. సింగర వాణి | 38 |
| 8. విమర్శ - విమర్శకుడు - వివేచనాదృక్పథం | - ఎరికంబట్టు రాజేష్ | 43 |
| 9. తెలుగు - మరాఠి దళిత స్త్రీవాద కథా సాహిత్యం | - కె. రమేష్ | 48 |
| 10. జానపద కళలు | - కడియం అజుబా మమతకుమారి | 54 |
| 11. నందమూరి తారక రామారావు పాత్రపోషణ వైశిష్ట్యం | - టి. కరుణాకర్ | 57 |
| 12. వివిధ రకాల మగ్గాలు - చేనేత ప్రాంతాలు | - కొలిపాక అరుణ | 63 |
| 13. జానపద సాహిత్యం - శృంగార గేయాలు | - డా॥. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు | 69 |
| 14. 'జాషువా' - ఒక ప్రతిఘటన చైతన్యం | - యం. రామలక్ష్మి | 74 |
| 15. అభ్యుదయోద్య1మ నేపథ్యంలో కన్నడ కథ | - డా॥ మల్లేశప్ప సిద్రాంపూర్ &<br>- డా॥ శ్రీనివాసరావు కాసర్ల | 77 |
| 16. సుషుప్తినుంచి - ఒక మెలకువ లోకిలి | - రవీంద్రసూరి నామాలలి | 82 |
| 17. దేవరకొండ బాలగంగాధర తిలక్ - మానవతావాదం | - పి. ఏడుకొండలు | 85 |
| 18. విశాఖ ఏజెన్సీ కోదు తెగ ప్రజలు-సామాజిక జీవన విధానం | - పెనుమాక రాజశేఖర్ | 89 |
| 19. యం.కె దేవకి గారి కథలు - స్త్రీలపై జరిగే అన్యాయాలు | - జి. శోభన కుమారి | 93 |
| 20. ఓల్గా గారి స్త్రీవాద సాహిత్యం | - రెడ్డి నీలిమ | 95 |
| 21. రాయలసీమ వెతలు - రామకృష్ణ కథలు | - రాళ్ళపాటి లోకనాథం | 98 |
| 22. ఎన్.టి.ఆర్. జానపదచిత్రాలు-సామాజిక స్పృహకు చిహ్నాలు | - డా॥. ఎస్. చిన్నరెడ్డయ్య | 100 |
| 23. బాలవ్యాకరణంలోని ఛందోమయ సూత్రాలు | - గొల్లపల్లి అమృత | 105 |
| 24. లేస్ హ్యాండీక్రాఫ్ట్ - నర్సాపురం, పాలకొల్లు అల్లికలు | - ముప్పిడి రాంబాబు &<br>- డా॥. పి. ఆనంద్‌రాజ్‌కుమార్ | 109 |
| 25. శుక్తిమతి కథల్లో సామాజిక స్పృహ | - సయ్యద్ అఫిన్ బేగం | 112 |
| 26. నల్లగొండ జిల్లా కథా సాహిత్యం | - చింతపల్లి దేవయ్య | 117 |
| 27. భానుమతి అత్తగారు కథల్లో పాత్రల వైవిధ్యం | - కిరణ్మాయి | 124 |
| 28. తుంగభద్ర నదీక్షేత్రాలు - సాహిత్యం | - కళ్యాణం అన్నపూర్ణ | 130 |
| 29. తెలుగు సాహిత్యంలో భక్తి శతక వికాస విశిష్టత | - పి. రమేష్ | 134 |
| 30. తుంగభద్ర పుష్కర మహాత్యం శ్రాద్ధకర్మలు | - బాలమణి | 140 |
| 31. Theorizing the gap between director's intention and audience's response | - Chandrasekhar Indla | 144 |

BHAVAVEENA
Vol. 17, Issue. 10, October 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలంగాణలో చర్మకారుల సామాజికార్థిక పరిస్థితులు - ఒక పరిశీలన

- డా॥. బి. కుమారస్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హన్మకొండ, వరంగల్ అర్బన్ జిల్లా.

భారతీయ సమాజమంటేనే కులం గుర్తుకోస్తుంది. కులం అనగానే వృత్తి గుర్తుకువస్తుంది. ఈ రెండింటిమీదే మనిషి మనుగడ ఆధారపడి ఉంటుంది. ఈ దేశంలో కులవృత్తినిబట్టి మనిషికి హోదా, గౌరవం మర్యాదలుంటాయనే విషయం తెలిసిందే. అయితే కులవృత్తికి గౌరవం ఆ గౌరవాన్ని అంటగట్టిన అగ్రవర్ణ ఆధిపత్య కుల భావజాలాన్ని పక్కనబెట్టినపుడు ప్రతి కులవృత్తికి దానికి అండే ప్రత్యేకతా గౌరవం, సమాజమమగడలో దాని ప్రత్యేకత ప్రాధాన్యం దానికుంటుంది. ఏవో కొన్ని ఆధిపత్య వర్గాలకు సంబంధించిన కులాలను మినహాయిస్తే ఈ దేశంలో ఉన్న కులాలన్నీ ఉత్పత్తికులాలే, ఈ కులాలు శ్రమతో, నైపుణ్యంతో కూడిన తమ కులవృత్తిని నిర్వహించే క్రమంలో ప్రతి శ్రామిక కులం శ్రమతో సృజనశీలతతో కొంత సాంకేతిక విజ్ఞానాన్ని తమ ఉత్పత్తి విధానానికి సంబంధించిన వస్తు సముదాయాన్ని అభివృద్ధి చేసుకున్నాయి. దీన్న మనం వృత్తిసంబందమైన విజ్ఞానం అనవచ్చు. అటువంటి వృత్తి జ్ఞానంలో మాదిగలది అగ్రస్థానం భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో జంతు చర్మాలను చెప్పులుగా, వ్యవసాయ రంగానికి ఉపకరించే సమస్త వస్తుసముదాయంగా కళాత్మకంగా సృజనశీలతతో తయారు చేసిన మొదటి సామాజిక శాస్త్రవేత్తలు చర్మకారులు.

భారత రాజ్యాంగం ద్వారా దళితులకు అనేక హక్కులను కల్పించారు. దళితుల అభివృద్ధికై వివిధ చట్టాలను చేసి ఎస్సీ కార్పోరేషన్, డి.ఆర్.డి.ఏ. సబ్‌ప్లాన్‌లతో పాటు చర్మకారు వృత్తులవారి కొరకు 1974లో లిడ్‌క్యాప్, ఎన్.ఎఫ్.యస్. డి.సి. సంస్థలను స్థాపించారు. వివిధ సంస్థల ద్వారా చర్మకారుల ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నాయో విశ్లేషించడం ప్రస్తుత పరిశోధనా పత్రం ఉద్దేశ్యం.

"సచ్చిన శవాల దీసి
సచ్చిన జీవాల దీసి
ఊరి రక్షణ చేసేటోళ్ళు
సచ్చిన జీవాలనుండి
తోలుదీసి ఆరబెట్టి
తాడుబేని తలుగుబేని
చెప్పుచేసి డప్పుజేసి
మనిషి రక్షణ చేసేటోళ్ళు
ఎవరు వాళ్ళు? తెలంగాణాలో గ్రామగ్రామాన
ఉండే మాదిగోళ్ళు (దళితులు)

భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన షెడ్యూల్డు కులాలకు చెందిన దళితులు/మాదిగలు నాలుగోస్థానాన్ని ఆక్రమించారు. షెడ్యూల్డ్ కులాల జాబితాలో 32వ కులం మాదిగ. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలలో మాదిగలుగాను, అరుంధతీయులుగాను, మినిమాదిగ్‌గాను, మాద్గిగాను, జాంబవులుగాను, మాతంగులుగాను పిలువబడుతున్న గొప్పజాతి. మాదిగలు భారతదేశవ్యాప్తంగా చమార్ లేదా మోచికి సమానం. పంజాబ్‌లో మచరంగ్, చమర్వ, చన్వార్ మరియు జాతియాకి సమానంగా రాజస్థాన్‌లో చండోద్, దుర్మిరియా, మొగవాల్, రాయ్‌గల్, బిందుఖి, బాలాకి కులాలకు సమానం. బొంబాయిలో మాంగ్, డబ్లి, వొజి, చూఆర్‌కి, గుజరాత్‌లో ధర్ మరియు మొఖిలి అలాగే తమిళనాడు-కర్నాటకలో చక్కిలియన్‌లకు సమానమైన స్థితి కలిగియున్నారు. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల జనాభాలో 16% మాదిగ సామాజికవర్గ ఉంది.

ప్రాచీన జాతులైన నిషాదులు, బిల్లుల నుండి చెండాలురుగా చెప్పబడుతున్న తెగల నుండి దళితులు ఆవిర్భవించారని, వీరినే నేడు ఎస్.సి.లుగా పిలుస్తున్నారని

వీరి ప్రధాన జంతువు ఏనుగు (మాతంగము) అని రోమిల్లా థాపర్ పేర్కొన్నారు. ఆర్యుల శక్తివంతమైన శత్రువులై దస్యులుగా చెప్పబడిన వారు ఈనాటి అస్పృశ్య జాతులేనని జాన్ మార్షల్ అభిప్రాయం. మోహంజదార్ ఇండస్ సివిలైజేషన్‌లో లొంగిపోయిన కిరాతులు కాల గ్రామములో అస్పృశ్యులుగా పరిణామం చెందివుంటారని. అనార్య జాతుల్లో నిషాదులు ప్రధానమైనవారని, వారే ఈనాటి దళితులని తన పరిశోధనల్లో 'టీబర్ ది ఎర్లీ' ఆర్యన్ అనే వ్యాసంలో తెలిపారు. మొహంజదార్‌లో లభించిన వస్తువులను బట్టి, అక్కడ ఆది భారతీయుల ఉనికి కనిపిస్తుంది. మార్షల్ అక్కడ రకరకాల వృత్తులు చేసే తోలుపనివారు, బుట్టలు అల్లేవారు, చేతితో చేసే తోలుపనివారు, బుట్టలు అల్లేవారు. చేపలు పట్టేవారు, కుండలు చేసేవారు, ఇంటి పని చేసేవారు వున్నారని పేర్కొన్నారు. ఈ దేశంలో పుట్టి పెరిగిన మూలవాసి ఆదిమ జాతులు, ఆర్యుల దండయాత్రలో పరాజితులై బానిసలుగా మార్చబడ్డారు. వీరిలో శ్రమిక జీవన విధానం ద్వారా సంక్రమించే పరస్పర ప్రేమాభిమానాలు మెండుగా ఉంటాయి. కర్కశత్వం, క్రూరత్వం, ద్రోహచింతన వంటి అవలక్షణాలు చాలా తక్కువ.

మాదిగలు భారతదేశానికి ఆర్యులు రాకముందు ఉన్న నిషాదులు, నాగులు, కిరాతులు, పూర్వ ద్రావిడుల వంటి ఆదిమ జాతులకు సంబంధించిన వారు. ఆర్యులతో జరిగిన యుద్ధాలలో ఓడిపోయి, పరాభవింపబడి, బానిసలుగా, నీచులుగా ఊరి పొలిమేర్లకు తరిమివేయబడి అస్పృశ్యులుగా ముద్రవేయబడ్డారని ప్రసిద్ధ చరిత్రకారులు డా॥ హూపెర్, గుస్టర్, యం.ఏ. షెర్రింగ్ లాంటి వారు పేర్కొనటం జరిగింది. మాదిగలు కేవలం చర్మకార వృత్తులు చేసుకునే వారే కాక తమ శక్తితో రాజులుగా, సైన్యాధిపతులుగా, ధర్మదాతలుగా, పండితులుగా, వీరులుగా, ప్రతిభావంతులుగా, సైనికులుగా, కళాకారులుగా, సమాజం విస్తరించే క్రమంలో ఆదిమ జాతులుగా ప్రాముఖ్యత కలవారుగా ఉన్నారని తెలియచేసే అనేక చారిత్రక ఆధారాలు లభ్యమవుతున్నాయి.

తరతరాల నుండి అంటరానివారిగా, ముట్టరాని వారిగా సమాజం వేసిన చండాలుడు అనే బిరుదును మోస్తూ... మనిషిగా చూడబడకా, తమ హక్కుల్ని హరించినప్పటికీ ఈ సమాజంలో ప్రజలందరికీ సమాజమంతా హాయిగా తిరిగే పాదరక్షలు కుట్టే వృత్తిలో లీనమై.. నాటి నుండి నేటి వరకు వారి చీకటిబ్రతుకుల్లో ఎలాంటి మార్పులేక, రాక సాగరంలాంటి సంసారాన్ని లాగలేక, కడు దుర్భరమైన దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సామాజిక జీవనం ముందుకు సాగడానికి వీలుగా వివిధ వృత్తుల నిర్వహణ కొరకే కుల విభజన జరిగిందని చెప్పటం పెద్ద ఘూటకం. ఇదే గనుక నిజమైతే అన్ని వృత్తుల వారికి ఒకే స్థాయి గౌరవం ఎందుకు కొరవడింది. కష్టపడి శ్రమ చేయకుండా బొజ్జ గణపతిలా కూర్చొని మంత్రాలు చదివి బొర్రలు పెంచే బ్రాహ్మణ వృత్తి అత్యంత గౌరవనీయమైనదిగా వారికి దైవత్వాన్ని ఎందుకు ఆపాదించారు. జంతువుల చర్మం వొలచి, మలినాన్ని వేరేచేసి చర్మాన్ని శుభ్రంగా నునుపు చేసి, కష్టపడి చెమటోడ్చి దొరల పాదాలకు కిర్రు చెప్పులు చేసేవారు చండాలురుగా, అంటరానివారుగా ఎందుకు చూడబడ్డారు. నేటికీ ఇదే పరిస్థితి భారతీయ సమాజంలో ఎందుకు కొనసాగుతుంది.

ప్రస్తుతం గ్రామానికి - అడవికి మధ్య నివసిస్తున్న మాదిగలు వ్యవసాయ ఉత్పాదక శక్తికి ప్రధాన శ్రమశక్తి వనరుగా ఉన్నారు. పశువులను, జంతువులను మాదిగలు మచ్చిక చేసుకున్నారు. మాదిగలు పశు కళేబరాల నుండి చర్మాలను వొలిచి, శుద్ధిచేసి, మానవ నాగరిక సమాజానికి అవసరమయ్యే చెప్పులను, డప్పులను, తోలు వస్తువులను కనిపెట్టారు. నేటికీ తోలుతో సృజనాత్మకమైన అనేక వస్తువులను ఉత్పత్తి చేస్తున్నారు. శరీర నిర్మాణాన్ని, శరీర ధర్మాలను శాస్త్రీయంగా ఎరిగిన తొలి వైద్యులు మాదిగలు. భౌతిక, రసాయనిక సామాజిక శాస్త్రవేత్తలు,

సమస్త సమాజాన్ని రంజింపజేసే సంగీత విద్వాంసులు మాదిగలు. గొంతులను, డప్పులను సమాచర, ప్రసార, ప్రచార సాధనాలుగా మార్చిన తొలి కమ్యూనికేషన్ ఇంజనీర్లు మాదిగలు.

ఈ దేశంలో చెప్పులు కుట్టుకొని బతికే కులాలకు పోటీగా ఎక్కడో చెకోస్లవేకియాలోని జ్లిన్ ప్రాంతానికి చెందిన "థామస్ బాటా 1894, అనే వ్యక్తి బాటా కంపెనీ రూపంలో నిలబడతాడని ఎపుడైనా ఊహించారా? చచ్చిన జంతువుల చర్మం వొలిచి, చెప్పులు కుట్టి ఈ సమాజానికి అందిస్తూ మాదిగలు దుర్భరజీవితం గడిపారు. అటువంటి మలినమైన పనులు చేస్తున్నందుకే ఊరికి దూరంగా పెట్టామంటున్న బ్రాహ్మణవాదులు ఇప్పుడు చెప్పుల తయారీ కర్మాగారాలకు అధిపతులయ్యారు. వృత్తిపోయినా కులం పోకుండా, ఊరిబయట మాదిగలు ఈ నాటికి దారిద్ర్యంతో కూడిన జీవితం గడుపుతున్నారు. చెప్పు తయారు చేసి, అమ్ముకునే అగ్ర వర్ణాలు కోట్లు సంపాదిస్తూ ఆ సమాజంలోనే గౌరవంగా జీవిస్తుంటే, అనగారిన వర్గాల్లోని చర్మకారులు ధైర్యంగా వారి జీవితాలను గడుపుతున్నారు.

మాదిగతత్వం శుభ్రత, భౌతికవాదం, రుచుల తత్వం మొదలగు వాటికి గ్రామ సమాజంలో తోలు పరిశ్రమల అభివృద్ధి చెందడానికి చాలా దగ్గరి సంబంధం ఉంది. మాదిగవాడల్లో పశుమాంస భక్షణ బ్రాహ్మణత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నపటికి, మాదిగలు తమ వృత్తిని కొనసాగించక పోతే దేశంలో తోలు పరిశ్రమ అభివృద్ధి చెందేదే కాదు. మొదట్లో చాలాకాలం పశుమాంసం తిని, తోలు కొమ్ములు మొదలగు అవయవాలను పారేసేవాళ్లు. బహుశా బ్రాహ్మణిజం గొడ్డు మాంసభక్షణ వదులుకున్న తరువాత తమదంటూ ఒక జీవన విధానంతో కూడిన తత్వంతో కొనసాగించిన మాదిగవాడలు పశు శరీరం ముఖ్యంగా తోలు, కొమ్ములు వంటి అంగాలపై తీవ్రమైన పరిశోధన చేశాయి. సమాజం ఒక పదార్థాన్ని మరో పదార్థంలోకి ముడి సరుకును, సరుకుగా మార్చింది కూడా ఆయా ముడిపదార్థాలతో నిరంతర సంబంధాన్ని (ఇంటర్ కోర్స్) కలిగి ఉండడం వల్లే. ఈ దేశంలో సైన్సు అభివృద్ధి ప్రకృతి శక్తులకు బ్రాహ్మణేతరులకు ఏర్పడ్డ నిరంతర సంబంధం వల్ల జరిగింది. గ్రామస్థాయిలో సైన్సు అభివృద్ధికి అతి ప్రముఖమైన పాత్ర నిర్వహించింది తోలు.

పచ్చి తోలును సమస్త మానవజాతికి ఉపయుక్తమైన పనిముట్లు తయారు చేసే తోలుగా దాన్ని ముడిసరుకుగా తయారు చేయడానికి ప్రత్యేకంగా కృషి చేసింది మాదిగల ఆలోచనే. మొదట్లో తోలుపై రోమాన్ని వదలించడానికి దాన్ని నిలువ ఉండే పదార్థంగా రూపొందించడానికి చాలా పరిశోధనలు చెయ్యాల్సి వచ్చి ఉంటుంది. పచ్చి తోలు ఉప్పు కలుపడమనే ప్రక్రియ కనుక్కోవడానికి మాదిగవాడలు ఒక సుదీర్ఘమైన శ్రమతో కూడిన కృషిచేసి ఉంటాయి. ఉప్పు తోలును మురుగకుండా కలుషితం కాకుండా కాపాడుతుందని నిర్ధారించకముందు ఎన్నోచోట్ల రసాయనాలను తోలుకు పట్టించి నిరాశచెంది ఉంటారు. క్రమంగా పనికిరాని వస్తు ధిక్కార సిద్ధాంతం ద్వారా తోలుకు ఉప్పుకు గల రసాయన ప్రక్రియను వాళ్ళు కనుక్కొని ఉంటారు.

ఈ విధంగా ఉప్పు రాసిన తోలును ఎంతకాలం ఎండ బెట్టాలి? ఎండబెట్టిన తోలు గట్టిగా కట్టెబారిపోతే దాన్ని తిరిగి మెత్తబర్చడమెట్లా అనే ప్రశ్నలన్నింటికి గ్రామంలోని ఏ ఇతర కులాల నుండి సమాధానాలు రాలేదు. తోలు చూస్తేనే ఛీదరించుకునే బ్రాహ్మణులు, కోమట్లు, వైశ్యులు ఈ ప్రశ్నల గురించే ఆలోచించలేదు. ఎండబెట్టిన తోలును తిరిగి ఒక నిర్దిష్టకాలం నీటిలో నానబెట్టడం ద్వారా దాన్ని మెత్తబర్చవచ్చని వాళ్ళు కనుగొన్నారు. ఈ విధంగా తోలు ఎలా అంటే అలా మలిగే ఒక ముడిపదార్థంగా మల్చడం వాళ్ళే స్వయంగా చైతన్యం ద్వారా నేర్చుకున్నారు. దీని తరువాత దశ వస్తు తయారీకి అనువుగా తయారైన తోలును వ్యవసాయ, మానవ అవసరాలను తీర్చే వస్తువులుగా తయారు చేసేందుకు పరికరాలను రూపొందించుకోవడం ఈ పరికరాల తయారీలో మాదిగవాడ

చేసిన శాస్త్రీయ పరిశోధన మామూలుది కాదు. ఈ పరికరాలను ఇనుము సహాయంతో చెయ్యకముందే కర్ర సహాయంతో చేసివుంటారు. ఈ ప్రక్రియలో పరికరాల రూపాన్ని నాణ్యతను వాడే పద్ధతిని రూపొందించుకోవడం చాలా క్లిష్టమైన పని. ఈ పనిలో ఇతర కులాల సహాయంలేదు.

పశువు శరీరం నుండి తోలును వేరుచేసే ప్రక్రియ కత్తులు రాకముందు చాలా క్లిష్టమైంది. అక్కడ తోలు తీతదారు కర్ర చెక్కలను ముఖ్యంగా తన చేతిని చాలా నైపుణ్యంగా వాడాడు. ముఖ్యంగా బొటనవేలును పిడికిలిని పశువు శరీరాన్ని తోలును జతపర్చే పొరను తెంపేందుకు ఉపయోగించేవారు. కత్తులు వాడకంలోకి వచ్చిన తరువాత పెద్ద కత్తి, చిన్నకత్తి అని రెండు సాదనాలను వాడి నైపుణ్యంతో చేతులనుపయోగిస్తూ తోలు తీస్తారు. ఎంగిల్స్ కోతి నుండి మనిషిగా మానవులు పరిణతి చెందడంలో శ్రమ గురించి రాస్తూ కత్తి అనే సాధనం రూపొందక ముందు చెయ్యి కీలకమైన పాత్ర నిర్వమించిందంటాడు. భారతదేశంలో చేతితో శ్రమను చాలా నైపుణ్యంగా వాడి ఉత్పత్తిని పెంచింది మాదిగలు. ఈ విధంగా ముందు చెయ్యి చెక్కల సహాయంతో ఆ తరువాత చెయ్యి కత్తి సహాయంతో తోలు తీశాక మొట్ట మొదట వారు “చేది చెల్ల తీయటం” అంటే తోలుకు అతుక్కున్న మాంసం ముద్దలని అసలు తోలుతో లేకుండా తొలగించడం. ఆ తదుపరి మనం అంతకుముందు చెప్పుకున్నట్లు తోలుకు ఉప్పు పట్టించి మడతెయ్యడం చేస్తారు. ఇక్కడ నుండి ప్రారంభమైన శ్రమతో కూడిన ఈ రసాయనిక ప్రక్రియ వివిధ దశలుగా 25 రోజులు సాగుతుంది. తదుపరి ఒక పశువు తోలుకు దాదాపు 15 కిలోల సున్నం ఒక తొట్టిలో వేసి తోలును అందులో ముంచుతారు. ఈ విధంగా వారం లేదా పది రోజులు తోలు సున్నంలో నానుతుంది. ఈ విధంగా నానుతున్నప్పుడు రోజూ చెయ్యితో తోలును తొట్టిలో తిప్పుతారు. దీన్ని “చెయ్యి తరుముట” అని అంటారు. ఆ తదుపరి దాన్ని శుభ్రమైన నీటిలో కడుగుతారు. పారే నీళ్ళలో చేతులు కడిగితే మరీ మంటగా ఉంటుంది. కడిగిన తోలును నీటిలో 2 రోజులు నానబెడతారు. ఆ తదుపరి తోలు పలుచబడేందుకు దాన్ని రాయిమీద లేదా మొద్దుమీద వేసి రాకుతారు. ఈ దశలో తోలు ఉండి చాలా దుర్వాసన వెలువడుతుంది. ఈ వాసనకు భయపడి మాదిగలు తోలుపని వదిలేస్తే అనలీ సమాజవేమయ్యేది? కాని ల్యాబొరేటరీలో ఎంత దుర్వాసనున్నను ఆధుని శాస్త్రజ్ఞుడెట్లాగైతే ల్యాబ్‌ను వదలడో (అదే సైంటిస్టు లక్షణం) అంతకంటే పట్టుదలతో మాదిగలు కూడా అంతగానే ఈ శాస్త్రీయ పని చేశారు. ఆ తదనంతరం ఈ తోలును 20-25 కిలోల తంగెడు ఒగరును తోలు పీల్చుకొని నాణ్యత చెందనారంభిస్తుంది. వారం రోజుల్లో తోలు వగరంతా పీల్చేస్తే మరో దఫా తంగెడి పొడి కలిపిన నీటిలో నానబెడతారు. ఈవిధంగా రెండు వారాలు తంగెడి పొడిలో ఉండినప్పుడు తోలు రసాయనిక మార్పుకు గురై వస్తు తయారీకి సిద్ధమౌతుంది.

ఇందులో సున్నం, తంగెడు చెక్క (పొడి), కరక్కాయ తోలును రసాయన మార్పుకు గురిచేస్తుందని దాదాపు రెండున్నర వేల సంవత్సరాల కింద వీరు మాదిగలు పరిశోధించి కనుగొన్నారు. ఈ ప్రక్రియ ఆచరనలో పెట్టి నాణ్యమైన తోలును తయారు చేశారు. అటు పారిశ్రామిక రంగాన్ని, ఇటు వ్యవసాయ రంగాన్ని విస్తరించారు. అంటే బహుముఖ తోలు పరిశ్రమను మారుమూల గ్రామాల్లో స్థాపించి మానవ జీవితాన్ని మనస్సును ఆనందమయం చేశారు. ఈ ప్రక్రియను బ్రహ్మణిజం, కులవ్యవస్థ గుర్తించక పోగా, దాన్ని కించపర్చింది. ఈ ప్రక్రియను ఓపికతో బాద్యతతో కొనసాగించిన ఆ మహా మాదిగత్వాన్ని, మాదిగ చైతన్యాన్ని కుళ్ళి కృషించే విధంగా అవమాన పరిచింది బ్రాహ్మణులు. ఈ విధంగా బ్రాహ్మణత్వం సైన్సును నిరంతరం చంపే కార్యరంగాన్నే తన కర్తవ్యంగా పెట్టుకున్నది.సైన్స్‌స్థానంలో కులతత్వాన్ని పెంచిపోషించింది. తోళ్ళ పరిశ్రమలో దళిత మహిళలు అనే అంశంపై

గతంలో కొందరు పరిశోధనలు చేశారు. వరంగల్ నగరానికి దగ్గరగా ఉన్న దేశాయ్‌పేట, ఏనుమాముల గ్రామాలలో పారిశ్రామిక కాలుష్యం ఏ విధంగా ప్రభావాన్ని చూపు తుందో ఆ పరిస్థితులలో దళిత మహిళలు ఏ విధంగా పనిచేస్తున్నారో, ఈ రంగంలో నివసిస్తున్న వారి జీవన విధానం ఏమిటి, తోళ్ల పరిశ్రమలో దళితులే ఎందుకు పనిచేస్తున్నారు. ముస్లింల ఆధ్వర్యంలోనే తోళ్ళ పరిశ్రమలు ఎందుకు స్థాపించబడ్డాయి తదితర అంశాలను ఎవ్వరూ పరిశోధనకు ఎంచుకోలేదు. ఈ అంశాలతోపాటు పనిలోని సమస్యలు, వేతనాలు, ఆదాయం, అప్పులు, విద్య, ఆరోగ్యం తదితర అంశాలను ఎవ్వరూ పరిశోధనకు ఎంచుకోలేదు. ఈ అంశాలతోపాటు పనిలోని సమస్యలు, వేతనాలు, ఆదాయం, అప్పులు, విద్యా, ఆరోగ్యం తదితర అంశాలను ఈ అధ్యయనంలో పరిశీలించడం జరిగింది. తోళ్ళ పరిశ్రమలో దళిత మహిళ-కాలుష్య ప్రభావం తోళ్ళ ఖార్ఖానాలలో పనిచేసే మహిళల జీవితానికి ప్రతిభింబం. వారి స్థితిగతుల్లో మార్పులు వచ్చేటట్లు చూడడమే ఈ పరిశోధన ప్రధాన ధ్యేయం.

వరంగల్ నగరం నుండి 3 కిలోమీటర్ల దూరములో దేశాయిపేట ఏనుమాముల గ్రామాలున్నాయి. ఇక్కడ ఎక్కువగా తోళ్ళ పరిశ్రమలే ఉన్నాయి. ఈపరిశ్రమలకు ముడిసరుకుగా ఉపయోగించే పచ్చి తోళ్ళు హైదరాబాద్, విజయవాడ, జనగామ ఇతర ప్రాంతాల నుండి వరంగల్‌కు దిగుమతి అవుతున్నాయి.

ఈ ప్రాంతంలో ఎక్కువగా తోళ్ళ పరిశ్రమలున్నాయి. ఇండ్లు ఒక క్రమపద్ధతిలో లేకుండా అస్తవ్యస్థంగా ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక పోవడంవల్ల మురికి రోడ్ల మీద ఇండ్ల ముందు నిల్వ కావడం వల్ల పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా పలువురు అనారోగ్యాలపాలవుతున్నారు. త్రాగునీటికి ఎక్కువ ఇబ్బందిపడుతున్నారు. ఈ ప్రాంతాల్లో ఒకే వాటర్‌ట్యాంక్ ఉంది. ఇక్కడి ప్రజల అవసరాలకు సరిపడే వాటర్ కెపాసిటీ ఈ ట్యాంక్‌కు లేకపోవడంతో ప్రజలు నీటికోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 90% ప్రజలకు మరుగుదొడ్లు, నీటి వసతుల సౌకర్యం లేదు. ఈ ప్రాంతంలో 90% మంది దళితులు (మాదిగలు) ఉన్నారు. కులం మాదిగా చెప్పుకొంటున్న క్రిస్టియన్ మతాన్ని స్వీకరించారు.

శ్రామికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. 20-30 సంవత్సరాల నుండి పరిశ్రమల్లో పనిచేస్తున్నప్పటికి పర్మినెంట్ లేకపోవడం వారి జీవితాలు దుర్భరంగ మారింది. క్యాంటీన్ సదుపాయం, కార్మికులకు గృహవసతులు, కాలనీ సదుపాయాలు, త్రాగునీటి సదుపాయాలు కల్పించే విధంగా చూడడం లేదు. దినసరి కార్మికులకు సంబంధించి కనీస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా లేదు. వారికి ఎలాంటి కష్టాలు వచ్చినప్పటికి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. శ్రామిక సంఘాలూ పట్టించుకోవడం లేదు. దీని వలన రోజువారి ఉద్యోగుల జీవితం దుర్భరంగా మారినాయి. పర్మినెంట్ వాళ్లకు కూడా ఇవే సమస్యలు ఉన్నాయి.

**ప్రధాన సమస్యలు :**

1) త్రాగునీటి సమస్యలు
2) మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం
3) డ్రైనేజీ అస్తవ్యస్తమై ఉండడం
4) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడం
5) కంపెనీల నుండి వ్యర్థ పదార్థం కాలుష్య నిర్మూలనకు చర్యలు సరిగా లేకపోవడం
6) క్యాంటీన్ సదుపాయాలు లేకపోవడం
7) టాకలింగ్ ప్రక్రియలో స్త్రీల చేతులు, కాళ్ళు ఇతర శరీర భాగాలు కాలే అవకాశం ఉంది. గర్భిణీ స్త్రీలు గర్భం కోల్పోయే ప్రమాదముంది. అంగవికలాంగులుగా మారే అవకాశం ఉంది. ఇది చాలా ప్రమాదభరితమైన ప్రక్రియ.

తోలు ఉత్పత్తులకు, తోలు వస్తువులకు ఇతర దేశాలలో సైతం లాభదాయకమైన గిరాకి ఉంది. ఏట

పదికోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం మన దేశం తోళ్ళ ఉత్తత్తుల ద్వారా ఆర్జిస్తుంది. ఇందులో కనీసం పది శాతం కూడా చర్మకారుల సంక్షేమానికి ఖర్చు చేయడం లేదు. మన దేశ ఎగుమతుల్లో తోళ్ళ పరిశ్రమ నాలుగో స్థానాన్ని ఆక్రమించింది. మన రాష్ట్రం నలు మూలల నుండి కావాల్సినంత ముడిసరుకు (పచ్చి తోళ్లు) లభిస్తుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత వలన ముడిసరుకు (తోళ్ళ)ను అభివృద్ధి చేసి, వాటిని వస్తువుల రూపంలోకి మార్చే పరిశ్రమలు ఏర్పాటు చేయనందున తోళ్ళ పరిశ్రమ అభివృద్ధి కావడంలేదు. దానిలో చర్మ కారులకు ఉపాధి లభించడం లేదు.

నేడు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాల ఫలితంగా అన్ని వృత్తుల్లాగానే చెప్పులు కుట్టే వృత్తిపై ప్రభావం పడి రాష్ట్రానికి కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న ఫ్యాషన్ షూలు, రకరకాలైన డిజైన్ చెప్పులు రావడంతో చర్మకారులకు పూర్తిగా పని దొరకకుండా పోతుంది. మాసిన షూలకు పాలిష్ చేయడం, తెగిన చెప్పులకు రిపేర్లు చేయడం తప్ప వీరు హస్తకళలతో తయూరు చేసిన చెప్పులు ఎవరు కొనడం లేదు. ఇలాంటి బడామార్కెట్ల పోటీనుండి తట్టుకోవాలన్నా కనీసం వీరివద్ద అధునాతనమైన పరికరాలు, కావాల్సినంత ముడిసరుకు అవసరం. అసలు వృత్తి చేసుకోవడానికి సరైన స్థలం లేక రోడ్ల కిరువైపుల చెట్ల క్రింద అనేక పాట్లు పడుతున్నారు. నానాకష్టాలు పడి అప్పులు తెచ్చి చెప్పులు చేసిన ఎవరూ కొనలేని దుస్థితి. ఇలాంటి దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటూ... అధునాతన పరికరాలు కొనగలరా? క్రొత్త మోడల్ చెప్పులు తయారు చేయ గలరా?

వృత్తి రీత్యా అత్యంత సామర్థ్యం, నైపుణ్యం కలిగిన చర్మకారులు స్వతహాగా షాపులు పెట్టె పరిస్థితి లేనందున పెద్ద షాపులలో రోజువారీ కూలీలుగా వేలాదిమంది చర్మకారులు అతి తక్కువ వేతనాలతో రాత్రింబవళ్ళు కష్ట పడుతూ శ్రమ దోపిడికి గురౌతున్నారు. వీరి అమాయ కత్వం, తప్పని పరిస్థితులను ఆసరా చేసుకొని వేధింపులకు గురిచేయడమే కాక యజమానుల దయాదాక్షిణ్యాల మీద బ్రతకవలసి వస్తుంది.

ఏంట్రా రోడ్ల ప్రక్కనే, బస్టాండ్ పక్కనే, చెప్పుల దుకాణాలు తెరిచారు. ఏం మీకు ట్రాఫిక్ రూల్స్ వర్తిం చవా? లేదా ట్రాఫిక్ పోలీసులు మీకు కనిపించడం లేదా? అని హుకుం జారీ చేయడం వారిని బెదిరింపులకు గురిచేసి మామూళ్లను వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఉన్న అడ్డయినా ఊడిపోతుందనే భయంతో మామూళ్ళను ఇవ్వక తప్పడం లేదు. నాలుగు పైసలు దొరుకుతాయనే ఆశతో రాత్రి కాస్తంత ఆలస్యంగా ఇంటికి వెళుతున్న సందర్భంలో పోలీసులు అడ్డుకుని అనేక రకాల ప్రశ్నలతో వేధిస్తూ, మూటల్లో ఏముందంటూ విచారణ పేరుతో లాఠీలతో చితకబాదడం, కాళ్ళా వేళ్ళా పడి వేడుకున్న వదలకపోవడం, జేబులో వున్న కాసిని డబ్బులు సైతం లాక్కోవడం ఇవన్నీ చెప్పులు కుట్టే చర్మకారుడి దైనందిన జీవితంలో రోజువారీ కార్యక్రమాలుగా మారి పోయాయి. ఇలా పొద్దంతా నిరీక్షించి కష్టపడి సంపాదిం చిన ఈ కొద్ది డబ్బులను సైతం రాబందుల్లా వీరు కాజేయడంతో కన్నీళ్లతో ఇంటి ముఖం పట్టాల్సి వస్తుంది. వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలాలను రాజకీయ పలుకుబడి కలిగిన వారు రౌడీ మూకలు కబ్జాచేసి ఆక్రమించుకుంటుంటే చూసిచూడనట్లు ఉండే ఈ ప్రభుత్వం, పొట్టకూటికోసం దిక్కులేని చర్మకారులు ప్రభుత్వ అనుమతితో వేసుకున్న చిన్న బంకులను రోడ్ల వెడల్పుతో, ట్రాఫిక్ నిబంధనల పేరుతో కనీసం బంకు లను తొలగించే ముందైనా చర్మకారులకు తెలియకుండా ఎక్కడికో తీసుకెళ్లి పడేస్తున్నారు.

## నిధుల్ నిల్ - ప్రణాళికలు ఫుల్ - ముందుకు కదలని మలుపు :

రాష్ట్రంలో పుష్కలంగా లభిస్తున్న ముడిసరుకు (పచ్చితోలు 95% పక్క రాష్ట్రమైన తమిళనాడు తదితర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. అందుకోసం మన

రాష్ట్రంలోనే చర్మ అభివృద్ధి పరిశ్రమలు ఏర్పాటుచేసి, చర్మకారులకు ఉపాధి కల్పించాలని 1979 సం॥లో ఆంధ్రప్రదేశ్ చర్మకారుల పరిశ్రమ అభివృద్ధి సంస్థ (లిడ్ క్యాప్) ను ఏర్పాటు చేయడం జరిగింది. కానీ ఆనాటి నుండి నేటి పాలక ప్రభుత్వం వరకు లిడ్ క్యాప్ సంస్థను ఒక అంటరాని సంస్థగానే చూస్తూ సంస్థ పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. నాలుగున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన లిడ్‌క్యాప్ సంస్థను చర్మకారులకు ఏవిధంగా ఉపయోగపడకుండా నిరుపయోగం చేశారు.

**లిడ్‌క్యాప్‌ను ఎత్తివేయాలని చూసిన ప్రభుత్వం:**

ప్రభుత్వ సంస్థ ఏర్పాటు లక్ష్యాన్ని తుంగలో తొక్కి పరిశ్రమకు కేటాయించిన నిధులతో అభివృద్ధి పరచ కుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. లిడ్‌క్యాప్ నష్టాల్లో కూరుకుపోయిందనే నెపంతో చంద్రబాబు ప్రభుత్వం లిడ్‌క్యాప్ అస్తులను అమ్మడానికి ప్రయత్నం చేశారు. లక్షలాది మంది చర్మకారుల ఆత్మాభిమానానికి ముడిపడి వారి ఉపాధి కల్పనకు ఏర్పడ్డ సంస్థను అమ్మకానికి పెట్టి వచ్చిన నిధులను క్రీడల కోసం ఖర్చు చేయాలని నిర్ణయిం చారు. చర్మకారులు మరియు దళిత సంఘాల నిరసనోద్య మాలకు తలవంచిన ప్రభుత్వం తమ తప్పుడు ఆలోచనను మానుకున్నది. తదనంతరం రాష్ట్రంలో ఉన్న 15 లక్షల చర్మకారుల్లో 8 లక్షల మందిని ప్రభుత్వం అతిపేద వారుగా గుర్తించి చర్మాభివృద్ధి కోసం పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించి వీరి జీవితాలను మలుపుతీసుకురావాలనే ఉద్దేశంతో అక్టోబర్ 2, 2002న గాంధీ జయంతి రోజున ప్రభుత్వం 350 కోట్ల రూపా యలతో బృహత్తరమైన ప్రణాళికలు రూపొందించి, ఇటలీతో ఒప్పందం చేసుకొని 'మలుపు పథకం' ప్రకటిం చింది.

చర్మకారులకు ముంబాయి, పూనే, కలకత్తా, మద్రాస్ లాంటి పట్టణాల్లో అధునాతనమైన శిక్షణ ఇప్పించి, రాష్ట్రంలో చర్మాభివృద్ధి కోసం 72 మినీ పార్కులు, 16 మీడియం పార్కులు, 7 మెగా పార్కులు ఏర్పాటు చేసి 8 లక్షల మంది చర్మకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. కాని నేటికి శిక్షణ పొందిన వారి సంఖ్య, ఏర్పాటు చేసిన పార్కుల సంఖ్య చూస్తే చాలా నామమాత్రం. 15 జిల్లాల్లో 651 మందికి మాత్రమే శిక్షణ ఇప్పించారు. కనీసం ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించిన 94 పార్కుల్లో ఏ ఒక్క పార్కు పూర్తికాలేదు. వాటి నిర్మాణం కోసం స్థలాలను సైతం నిర్ణయించలేదు. అక్కడక్కడ పార్కుల ప్రారంభోత్సవాలు మాత్రం చేస్తు న్నారు. అంతేకాక ప్రత్యేక విద్యా, వైద్యం అందజేస్తామని ఢంకా వాయించారు. చర్మకారుల వేలాది మంది పిల్లలు బాలకార్మికులుగా తల్లిదండ్రులు చేస్తున్న చర్మ వృత్తిలోనే మగ్గుతున్నారు. వీరికి ప్రత్యేక విద్య, వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. "రాజు తలచుకుంటే దెబ్బ లకు కొదువా" అన్నట్లు మంగళవాయిధ్యాలతో "మలుపు పథకం" ప్రారంభించి 11 సంవత్సరాలు గడుస్తున్నా చర్మకారులకు ఇంకా ఈ దుస్థితే ఎందుకు పట్టింది.

ప్రభుత్వ ప్రచారం మాత్రం ఆకాశన్నంటిన అభివృద్ధి మాత్రం గడపదాటట్లేదు. మలుపు పథకం ముందుకు కదలటం లేదు. కారణం లిడ్‌క్యాప్ సంస్థకు నిధులు నిల్. అతి కష్టం మీద అధికార సిబ్బందికి జీతభత్యాలు పోను, చర్మాభివృద్ధికోసం కేటాయించిన 350 కోట్ల రూపాయలు ఇక్కడ ఖర్చు చేశారు. ఇతర సంస్థలకు ఈ నిధులు మళ్ళించారని ఆధారాలు కనిపిస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫండింగ్ అవకాశాలు ఉన్నప్పటికీ కూడా మాదిగల అభివృద్ధి కోసం ఖర్చు పెట్టడానికీ, నిధులు తీసుకోవడానికి ముందుకు రావటం లేదు.

**SOURCES OF FUNDING :**

For all the above activities, there are number of funding resources at central and state Government level with subsidies being offered upto 30-40%.

1) Department of Industrial Policy and Promotion (DIPP) New Delhi

2) KVIC through cluster development programs New Delhi.
3) Ministry of Rural Development Government of India, New Delhi
4) Ministry of Social Justice, New Delhi
5) NABARD for carcass recovery
6) Integrated Development of Leather Sector (IDLS) New Delhi
7) S.C. Cooperative Society Andhra Pradesh
8) Small Industrial Development Bank of India (IDBI)
9) Industrial Development Bank of India (IDBI)
10) Andhra Pradesh State Finance Corporation (APSFC)
11) National Rulra Employment Program (NREP)
12) Rural Landless Employment Guarantee Program (RLEGP)
13) Indira Awaas Yojana (IAY)
14) Jawahar Rozgar Yojana (JRY)
15) Integrated Rural Development Program (IRDP)
16) Andhra Pradesh Cooperative Bank (APCOB)
17) National Scheduled Caste Finance Development Corporation (NSFDC)
18) Society for Elimination of Poverty in Rural Area (SERP)
19) National Integrated Rural Development (NIRD)

In the XI Five Year Plan out of Rs. 253 Crores, only Rs. 50 Crores were utilized for Leather artisan sector by the NGOs and the rest of the money has gone to industry. Great Chunk of the funds are being utilized by the establishedleather industries in the form tax concession, subsidies etc. Due to lack of awareness among the leather artisans many artisanal programs could not be under taken successfully in our country.[23]

**నాయొక్క ముఖ్య సూచనలు :**

1) లెదర్ ఇండస్ట్రీస్ పార్కులకు స్థలాలు వెంటనే కేటాయించాలి.
2) ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక లెదర్ ఇండస్ట్రీస్ పార్కును ఏర్పాటు చేయాలి
3) చర్మకారులందరికీ శిక్షణ ఇచ్చి, ఉపాదిని కల్పించాలి
4) లిడ్‌క్యాప్ సంస్థను పరిశ్రమల శాఖ నుండి ఎస్సీ కార్పోరేషన్‌కు మార్చాలి.
5) చర్మకారులందరికి పక్కా ఇళ్ళు, ఉచిత కరెంటు, తెల్లరేషన్‌కార్డు, ఉచిత వైద్యం అందించాలి.
6) లెదర్ పార్కుల నిర్మాణం కోసం మలుపు పథకానికి కేటాయించి ఖర్చు చేయకుండా దారి మళ్ళించిన నిధులన్నింటిని కలిపి ప్రతి సంవత్సరం కేటాయించి ఖర్చు చేయాలి.
7) రోడ్ల ప్రక్కన వృత్తి చేసుకునే ప్రతి చర్మకారుడికి బంక్‌ను ఏర్పాటు చేయాలి. లేదా ఒక లక్ష రూపాయల వ్యక్తిగత లోను ఇవ్వాలి. మహిళల కోసం ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి.
8) చర్మకారుల పిల్లలందరికి ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యను అందించాలి.

9)బ్యాంక్ కాన్‌సెంట్ లేకుండా లోన్లు ఇవ్వాలి.

10) లిడ్‌క్యాప్ సంస్థకు చైర్మన్‌ను నియమించాలి.

11) అంటరానితనం నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

12) పంచరాయి, బంజరు భూములను చర్మకారులకు ఏర్పాటు చేయాలి.

13) ప్రభుత్వం ప్రత్యేకంగా చర్మకారు ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి.

ఈ విధంగా దళితులు (మాదిగలు) సమాజ అభివృద్ధికి తమ జీవితాల్ని త్యాగం చేసి జంతువుల చర్మంతో వివిద వస్తువులను, వ్యవసాయ పరికరాలను తయారు చేశారు. ఒక శాస్త్రవేత్త ప్రయోగశాలలో చేసే కృషికంటే ఏ మాత్రం తీసిపోని కృషిని చేశారు. చేతితో అనేక పనులు చేయడం కంటే, చర్మం ద్వారా అనేక వస్తువులు తయారు చేసి సమాజ అభివృద్ధికి పాటుపడవచ్చునని నిరూపించారు. శ్రమకు నిజమైన విలువ ఉందని నిరూపించారు. అయితే మాదిగల పరిశోధనలు అన్నీ వ్యక్తిగతమైనవిగా కాకుండా, సమాజ వ్యవస్థకు నిత్యం ఉపయోగపడేవని ఈ పత్రంలో నిరూపితమైంది. విదేశీయులు భారత దేశంలో ప్రవేశించి వివిధ షోరూములు పెట్టుకొని, దానిలో కూడా మాదిగ వృత్తిదారులనే నామమాత్ర జీతంతో ఉద్యోగులుగా పెట్టుకొని శ్రమదోపిడీ చేస్తున్నారు. మరోవైపు తమకు చట్టపరంగా కేటాయించిన నిదులను కూడా సక్రమంగా అమలు చేయకుండా ఆ నిధులను వివిధ పథకాలకు దారి మళ్లించి, మాదిగల అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తున్నారు. అందువల్ల మాదిగ వృత్తిదారులకు ఎంత నైపుణ్యమున్నప్పటికీ నేటికీ గ్రామాల్లో అరకొర సౌకర్యాలతోనే జీవిస్తున్నారు.

❀ ❀ ❀